క్లుప్తంగా

కరపత్రాలు విడుదల

సైదాపూర్: హుజూరాబాద్ కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలో జిల్లా సాధన జేఏసీ నాయకులు శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా ఏర్పాటుకు రాజకీయ పార్టీల నుంచి అనుకూల ప్రకటన చేయాలని, ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీ హుజూరాబాద్‌ను జిల్లా చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సదానందం, మాజీ ఎంపీపీలు వెంకట్రాజం, వీరేశం, నమిండ్ల రవీందర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గున్నాల కృష్ణమూర్తి, గొల్లపెల్లి కనుకయ్య, రాజయ్య, ఎంపీటీసీ తొంట ఓదేలు, యాదగిరి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం


నగదు అందిస్తున్న సాంబారి కొమురయ్య

చిగురుమామిడి: మండలంలోని చిన్నములకనూర్ గ్రామానికి చెందిన పందిపెల్లి ఎల్లయ్య మృతిచెందడంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. దహన సంస్కారాలకు బీఆర్ఎస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. ఎల్లయ్య కరీంనగర్‌లో కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు, ఎలాంటి ఆస్తులు లేవు, రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి, మృతుడికి భార్య రాజవ్వ, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉండటానికి సరైన గూడులేకపోవడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కార్యక్రమంలో కరీంనగర్ రైతుబంధు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు మారెల్ల కొమురయ్య, నాయకులు రాజు, నాగరాజు, దిలీప్‌కుమార్, వార్డు సభ్యులు పందిపెల్లి రాజు, చంద్రయ్య, మల్లయ్య, రమేశ్ ఉన్నారు.

కవి ఖాలీద్‌కు అభినందన

కరీంనగర్ కల్చరల్: నగరానికి చెందిన ఆటోడ్రైవర్, కవి ఎండీ.ఖాలీద్‌ను శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఖాలీద్ రచించి ఆవిష్కరించిన మనమంతా ఒక్కటే పుస్తకాన్ని మంత్రికి అందజేశారు. సమాజాభ్యుదయ పరమైన ఇలాంటి కవితలతో కూడిన పుస్తకాలు మరిన్ని రచించాలని మంత్రి ఆకాంక్షించారు. ఓ ఆటో డ్రైవర్‌గా ఉంటూ విభిన్న అంశాలు, సామాజిక సమస్యలపై స్పందిస్తూ కవిత్వం రాస్తున్న ఖాలీద్ గొప్ప కవిగా రాణించాలని అన్నారు.

వైఎస్సార్‌టీపీకి రాజీనామా

కరీంనగర్‌రూరల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కాంగ్రెస్ పార్టీకి షర్మిల మద్దతు ప్రకటించినందుకు నిరసనగా వైఎస్సార్‌టీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వరాల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలకు లేఖను పంపించానని అన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్‌పై తగిన నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు.

పరామర్శ

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ల కుటుంబాలను నగరంలోని ఆటో అడ్డాల నాయకులు శుక్రవారం పరామర్శించారు. వన్నారంకు చెందిన కోడూరి మల్లేశం, గజ్జల గణేశ్‌ల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, వన్నారం ఆటోస్టాండ్ అధ్యక్షుడు గుర్తురి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గజ్జల సురేశ్, తాటి జనార్దన్, రాచూరి నర్సింగం, శ్యామల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కరీంనగర్ సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు, లయన్ జిల్లా అదనపు కార్యదర్శి కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేశారు. కవి, రచయిత, కాలమిస్ట్‌గా పేరొందిన మధుసూదన్‌రెడ్డి విశ్రాంత జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేశారని పలువురు మిత్రులు సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణ కిశోర్, మహేందర్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణరావు, సత్యం, కిషన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కల్లాలు నిండే.. ధాన్యం రోడ్డెక్కే

మానకొండూర్: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తుండటంతో కేంద్రాలు నిండుకుంటున్నాయి. నామమాత్రంగా కొనుగోళ్లు జరుగుతుండంతో స్థలం లేక రోడ్లపై ఆరబోస్తూ కుప్పగా చేస్తున్నారు. రాత్రివేళ ధాన్యం కుప్పలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పచ్చునూర్ గ్రామ శివారులో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. రహదారిపై ధాన్యం పోయొద్దని అధికారులు చెబుతున్నా తప్పని పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. కొనుగోళ్లు త్వరగా చేపడితే ఇబ్బందులు తప్పుతాయని పేర్కొంటున్నారు.


వన్నారంలో రహదారిపై ఆరబోసిన ధాన్యం



గండి.. మరమ్మతు చేయండి

రామడుగు: వానాకాలంలో కురిసిన భారీ వర్షాలతో రహదారి పక్కన మట్టి కొట్టుకపోయి పెద్ద గండి ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. కరీంనగర్ – జగిత్యాల ప్రధాన జాతీయ రహదారి రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామ రైతువేదిక వద్ద గండి ఏర్పడి ప్రమాదకర పరిస్థితి నెలకొందని వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు గండి పూడ్చాలని కోరుతున్నారు.

నృత్య పోటీల్లో బొమ్మనపల్లి విద్యార్థినులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థినిలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంకు ఎదురుగా ఉన్న గోదావరి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జానపద నృత్యపోటీల్లో పాల్గొన్నారు. శుక్రవారం రాష్ట్ర పాపులేషన్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా రోల్ ప్లే చేశారు. 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థినులు మూడురోజుల క్రితం కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో 14 టీఎంలతో కలిసి పోటీల్లో పాల్గొన్నారు. 'యువత మత్తుపానీయాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై' చేసిన డ్యాన్స్ పలువురిని ఆకట్టుకుందని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల సర్పంచ్ భూంరెడ్డి, ఉపసర్పంచ్ పెండ్యాల శారద, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం, విద్యాకమిటీ చైర్మన్ గంప రమేశ్, పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



జానపద నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు నిక్షిప్త, రాజ్‌కుమార్ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


రామడుగు: అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

ఓటుహక్కు వినియోగంపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్, సీఎల్ ఆర్పీలు, సిబ్బంది

జమ్మికుంట: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం, దీపావళి పండుగ సందర్భంగా మట్టి దీపాలు ఉపయోగించాలని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధం, సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు పండుగ రోజున మట్టి దీపాలు వెలిగించాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మల్లీశ్వరి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ బావర్‌సింగ్, మధుసూదన్, ఈఈ శ్రీకాంత్, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల, దేవేంద్ర, సరళ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు


చొప్పదండి: షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మంకమ్మతోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ టెస్టులు నిర్వహించి వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుత రాజు, బొంగోని దామోదర్, మేచినేని రాజేశ్వర్‌రావు, శంకరయ్య, ఉపసర్పంచ్ కాసు వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

మానకొండూర్‌రూరల్: మండలంలోని దేవంపల్లిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది డా.ఎంఎల్ఎస్ రెడ్డి, ఆర్గనైజర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


దేవంపల్లిలో...

నిత్యాన్నదాన వంటశాల ప్రారంభం


వంటశాలను ప్రారంభిస్తున్న దాతలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి దేవాలయం(బొమ్మలగుడి)లో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానం కార్యక్రమానికి ఆలయ ట్రస్టీ కొండూరి కుటుంబ సభ్యుల సహకారం, మహాలక్ష్మి ఐరన్‌అండ్ హార్డ్‌వేర్ యాజమాని రామడుగు సునీత, రవీందర్‌రావు సౌజన్యంతో నూతన వంటశాలను నిర్మించారు. శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వంటశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవాలయంలో నిత్యాన్నదానం వంటశాల ఏర్పాటు కోసం దాతలు ముందుకు వచ్చారని, ఇప్పుడు భక్తులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు వేణుగోపాలశర్మ, ఆలయ ట్రస్టీలు కొండూరి కుటుంబ సభ్యులు, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, భవాని భజన సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



తిమ్మాపూర్: మండలంలోని అల్గునూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. అల్గునూరు పరిధిలోని మహాత్మా నగర్, తిమ్మాపూర్, అలుగునూర్ ఎల్ఎండీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'కులం ముసుగులో ఎమ్మెల్యే కాలేరు'


మాట్లాడుతున్న ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

సైదాపూర్: కులం ముసుగులో పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలవడం అసాధ్యమని ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య, సర్పంచులు, నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పదేళ్లలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు విద్యా, వైద్యంపై అవగాహనతో మండలంలో మోడల్ స్కూల్, కేజీబీవీ, బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయించారని, గౌడ కులస్తులు సతీశ్‌కుమార్ మూడోసారి ఎమ్మెల్యే కావాలని కోరుకుంటున్నారని అన్నారు. హుస్నాబాద్‌లో అభివృద్ధి పొన్నం ప్రభాకర్‌కు కన్పించడంలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు రాములు, కొమురయ్య, నాయకులు ముకుందరెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, గౌడ సంఘం నాయకులు వీరన్నగౌడ్, రవీందర్‌గౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో పొన్నం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో పలు పార్టీల నుంచి దాదాపు 150 మంది కాంగ్రెస్‌లో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు బోయిని వంశీకృష్ణ, సోషల్‌మీడియా కన్వీనర్ బోయిని ప్రశాంత్, వార్డు సభ్యులు కోరెపు పుష్ప, మాజీ వార్డు సభ్యులు బోయిని ఎల్లయ్య, ముదిరాజ్ సొసైటీ డైరెక్టర్ గూల్ల రవి, కోతి సది, నాయకులు బుర్ర భద్రయ్య, సంపత్, ట్రాక్టర్ యూనియన్ ప్రెసిడెంట్ బొల్లి తిరుపతి, అన్నవేని రవి, గూల్ల శ్రవణ్, నూనె తిరుపతి, పిల్లి శ్రీనివాస్, తాడిచెర్ల రాంచంద్రం, పెండ్యాల కృష్ణారెడ్డి, కూతురు ప్రభాకర్‌రెడ్డి, చెప్యాల ఎల్లయ్య, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఠాకూర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్‌కుమార్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు వేణుగోపాల్, కాంతాల మహిపాల్‌రెడ్డి, కంది నాగరాజు, సంతోష్‌కుమార్, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.


భూపతియాదవ్‌కు కండువా కప్పుతున్న నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేల్పుల భూపతియాదవ్‌తో పాటు పండుగ రాజయ్య తదితరులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాచర్ల అంజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని భూపతియాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వీడ్కోలు


సన్మానిస్తున్న జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రాజరత్నం, తుమ్మ శ్రీనివాస్, పల్లెపాటి వేణుగోపాల్‌రావులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనందం, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

గంగాధర: పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని ఎస్సై పుల్ల అభిలాష్ కానిస్టేబుల్‌గా ఎంపికైనవారికి సూచించారు. మండలంలో 34 మంది ఉద్యోగానికి ఎంపిక కాగా శుక్రవారం వారి సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చట్టాల అమలు, నేరాలను నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించడం, సహాయక సేవలు అందించే లక్షణాలు ఉండాలన్నారు. ప్రజలు, వారి ఆస్తులు రక్షించడం, చట్టాలను ఉల్లంఘించిన వారిని పట్టుకోవడంలో బాధ్యత ఉండాలన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించినవారిని అభినందించారు.


కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులతో ఎస్సై అభిలాష్

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌రూరల్ మండలంలో శుక్రవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు వ్యక్తుల వద్ద రూ.13వేలు విలువ గల 65 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కనకట్ల రవి, కుక్కల మల్లవ్వ, ఎలిగటి లచ్చయ్యలపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై శ్రీనివాస్, మోసిన్, ఖాసంబి, రవిలు పాల్గొన్నారని అన్నారు.


పట్టుకున్న మద్యం